క్లుప్తంగా

లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులు నవంబర్ 1 నుంచి మార్చి 31వరకు సబ్ ట్రెజరీ కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు అమ్మన చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు లైఫ్ సర్టిపికేట్‌లను టీఎస్ ఫోలియో యాప్ ద్వారా, మీసేవా ద్వారా లేదా నేరుగా కార్యాలయంలో సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

'కేసీఆర్‌ను గెలిపిద్దాం'

ములుగు(గజ్వేల్): గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నేతలు కోరారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, ములుగు పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి ఆధ్వర్యంలో ములుగు మండలం కొత్తూరులో బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందరికీ అందుతున్నాయని ప్రజలకు వివరించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సలీం, వైస్‌ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్, ఏఎంసీ వైస్ చైర్మన్‌లు నరేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

యార్డులోనే కొనుగోలు చేయాలి



వినతి పత్రం ఇస్తున్న రవీందర్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులోనే రైతులు పండించిన ఉత్పత్తులు కొనుగోలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం రైతు ఐక్య వేదిక నాయకుడు రవీందర్ మార్కెట్ కార్యదర్శి సురేష్‌బాబుకు వినతి పత్రం ఇచ్చారు. అడ్తి వ్యాపారులు రోడ్లపై కొనుగోలు చేస్తుండటంతో తూకంలో మోసం చేస్తున్నారని, దీనిని పర్యవేక్షించాల్సిన తూనికలు కొలతల శాఖ స్పందించడం లేదన్నారు. సీజన్ ప్రారంభమైన నెల గడిచినా మార్కెట్ యార్డులో కొనుగోళ్లు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. పత్తి మద్దతు ధర రూ.7,050 ఉంటే వ్యాపారులు రూ.6,600లకే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. సీసీఐ కేంద్రం ఏర్పాటు చేస్తే పత్తి రైతులకు మేలు జరుగుతుందన్నారు.

బీజేపీకి సంబంధం లేదు



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు దేవరాజు

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై బీఆర్‌ఎస్ నాయకులు బురద జల్లే ప్రయత్నం మానుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు అన్నారు. మిరుదొడ్డి పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తి దాడి దురదృష్టకరమన్నారు. ఆయనపై దాడి చేసిన వ్యక్తికి బీజేపీకి ఎలాంటి సంబంధం లేకున్నా రఘునందన్‌రావు దిష్టి బొమ్మలను తగుల బెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఎమ్మెల్యే దిష్టి బొమ్మలను దహనం చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు కేసులు నయోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంగడి బజారు వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం బీటీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ఆవిర్భవించిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించి, కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గజ్జెల సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

యుద్ధభేరీ కరపత్రం ఆవిష్కరణ

మద్దూరు(హుస్నాబాద్): నవంబర్ 5వ తేదీన మాదిగల హక్కుల కోసం నిర్వహించనున్న మాదిగల యుద్ధభేరీని జయప్రదం చేద్దామని జనగామ నియోజకవర్గ ఎమ్మార్పీస్ ఇన్‌చార్జి రాజేందర్ మాదిగ అన్నారు. మద్దూరు మండల కేంద్రంలో యుద్ధభేరి కరపత్రాలను ఆవిష్కరించారు.

బంద్ విజయవంతం



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో మూతబడిన దుకాణ సముదాయాలు

- ఎంపీపై దాడిని ఖండించిన బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు
- బంద్‌కు పిలుపు ఇచ్చిన నాయకులు
- మూతపడిన దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు

మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ ఎంపీ, బీఆర్‌ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తి దాడిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు చేపట్టిన బంద్ విజయవంతమైంది. మంగళవారం మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని దుకాణ సముదాయాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బంద్ పాటించాయి. మిరుదొడ్డిలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎంపీ త్వరగా కోలుకోవాలని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అక్బర్‌పేట-భూంపల్లి మండలంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఎంపీపై జరిగిన దాడిని నిరసన వ్యక్తం చేస్తూ నాయకులు ఆందోళన చేపట్టారు.

స్వచ్ఛందంగా మూసివేత

దౌల్తాబాద్(దుబ్బాక): సూరంపల్లిలో మెదక్ ఎంపీ దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తి దాడికి నిరసనగా మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బంద్‌కు పిలుపు ఇచ్చారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాలు ముతపడ్డాయి. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. దీంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.



దౌల్తాబాద్‌లో జన సంచారం లేని దృశ్యం

హోమాలు.. ప్రత్యేక పూజలు

కత్తిపోటుకు తీవ్రంగా గాయపడిన ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత, ఎంపీపీ కొత్త పుష్పలత, జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి బాలాజీ ఆలయంలో మృత్యుంజయ హోమం చేశారు. మరికొంతమంది షిర్డీలోని సాయిబాబా ఆలయంలో పూజలు చేశారు.



దుబ్బాకలో మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



ములుగు(గజ్వేల్): బస్వాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజ చేస్తున్న జెడ్పీటీసీ జయమ్మ



కుకునూరుపల్లిలోని రామాలయంలో పూజలు చేస్తున్న ప్రజా ప్రతినిధులు



కూడవెళ్ల రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



మహంకాళి దేవాలయంలో పూజలు చేస్తున్న గజ్వేల్ మున్సిపల్ పాలక వర్గం

పోతగల్ల మృతి తీరనిలోటు



ఓదారుస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

గజ్వేల్: వర్గల్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పోతగల్ల లింగం మృతి మాదిగల ఉద్యమానికి తీరనిలోటని గజ్వేల్ జెడ్పీటీసీ మల్లేశం అన్నారు. మంగళవారం ఆయన మృతికి సంతాపం తెలిపారు. మాదిగల హక్కుల సాధనకు పోతగల్ల లింగం కృషిచేశారని కొనియాడారు. ఎంఈఎఫ్ (మాదిగ ఉద్యోగుల సమాఖ్య) గజ్వేల్ మండల శాఖ అధ్యక్షుడు సల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగభూషణం, రాష్ట్ర మహిళా కార్యదర్శి బెల్లి శ్యామల, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి క్రిష్ణ, రాష్ట్ర నాయకుడు మైస రాములు తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): మండలంలోని చౌదరిపల్లికి చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పోతగల్ల లింగం అకాలమృతికి ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మంగళవారం లింగం పార్థివ దేహంపై పూలమాలవేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, జెడ్పీటీసీలు బాలూయాదవ్, మల్లేశం, నాయకులు ఉన్నారు.

విద్యార్థుల ఐక్యతా ప్రతిజ్ఞ



ఐక్యతా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

నంగునూరు(సిద్దిపేట): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకొని మంగళవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రామస్వామి మాట్లాడుతూ దేశ మొట్టమొదటి ఉప ప్రధానిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ సమైక్యత, భద్రత, ఐక్యతకు కృషి చేశారన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

చేర్యాల(సిద్దిపేట): సర్దార్ వల్లాబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైకతా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.సర్వేశ్వర్‌రెడ్డి పటేల్ దేశానికి చేసిన సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మధు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

హుస్నాబాద్‌రూరల్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు సీఐ ఎర్రల కిరణ్ తెలిపారు. మంగళవారం గాంధీనగర్, తోటపల్లి, చౌటపల్లి, మల్లంపల్లి, జిల్లెలగడ్డ గ్రామాల్లో ఎస్ఎస్‌బీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు నవంబర్ 30న జరిగే ఎన్నికల నియమావళి వివరించారు. స్వచ్ఛందగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఓటుపై ఎవరైన భయభ్రాంతులకు గురిచేస్తే ఈ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు అప్‌లోడు చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. 100కు ఫోన్ చేసినా స్థానిక పోలీసులు స్పందిస్తారని చెప్పారు.

దుబ్బాక: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏసీపీ సురేందర్ రెడ్డి అన్నారు. దుబ్బాక పట్టణంతో పాటు మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌లో బీఎస్ఎఫ్ బలగాల ఆధ్వర్యంలో మంగళవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీ శ్వేత ఆదేశానుసారం ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికల ప్రచారాన్ని ఎవరైన అడ్డుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌ల వద్ద పారా మిలిటరీ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఐ మున్నూరు కృష్ణ, ఎస్ఐ గంగరాజు, ప్రొబేషనరీ ఎస్ దామోదర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ సురేందర్ రెడ్డి, బీఎస్ఎఫ్ దళాలు

బీఆర్‌ఎస్‌లో చేరిక

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ నుంచి పోటీచేస్తున్న కేసీఆర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్ గ్రామంలో మంగళవారం పలు పార్టీలకు చెందిన యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేశారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి ఇతర రాష్ట్రాలకు తెలంగాణను కేసీఆర్ ఆదర్శంగా నిలిపారన్నారు.

ఎంపీపై దాడి హేయమైన చర్య



దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



దుబ్బాకలో మాట్లాడుతున్న దళిత, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్లు

దౌల్తాబాద్(దుబ్బాక): సూరంపల్లిలో దుబ్బాక బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తి దాడి హేయమైన చర్య అని దుబ్బాక నియోజక వర్గ పాస్టర్ల సంఘం వర్కింగ్ అధ్యక్షుడు గడ్డమీది రాజాగౌడ్ మండిపడ్డారు. సూరంపల్లిలో కత్తి దాడి జరిగిన అంజయ్య ఇంటికి ఆయా గ్రామాలకు చెందిన పాస్టర్లు వెళ్లి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీపై దాడి చేసిన వ్యక్తిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు.

దుబ్బాకటౌన్: మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడిచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని దళిత, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్లు గుర్రాల శ్రీనివాస్, కరికె శ్రీనివాస్, వనం రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం దుబ్బాకలో మాట్లాడారు. హత్యాయత్నం చేసిన నిందితుడు రాజుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

దౌల్తాబాద్(దుబ్బాక): మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలని దౌల్తాబాద్ మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి జరగడం బాధాకరమన్నారు. దాడులు చేయడం సరికాదన్నారు.

దౌల్తాబాద్(దుబ్బాక): ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిచేసిన నిందితులందరినీ గుర్తించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని దండోరా శివరాజ్ ఆధ్వర్యంలో మండల బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, వైస్ ఎంపీపీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడిని ఖండించిన ఎన్నారై

దుబ్బాకటౌన్: ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి ఘటనను ఎన్నారై బీఆర్‌ఎస్ యూకే ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదని, హింసతో ఏమీ సాధించలేరన్నారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు సృష్టించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. దాడుల సంస్కృతి మంచిది కాదని, నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి

హుస్నాబాద్: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 39వ వర్థంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆమె చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్థంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మంగళవారం నిర్వహించారు. మిరుదొడ్డిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మద్దెల రాజేష్, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్, మండల అధ్యక్షుడు అక్కపల్లి బాల్ నర్సాగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బెజ్జంకి(సిద్దిపేట): దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధి వర్థంతి కార్యక్రమాన్ని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జంకి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

దుబ్బాక: దివంగత మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ వర్థంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. మంగళవారం దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

సిద్దిపేటజోన్: దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హరికష్ణ, సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలో ఇందిరా గాంధీ వర్థంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



హుస్నాబాద్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మిరుదొడ్డిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఢిల్లీలో హుస్నాబాద్ నాయకులు

హుస్నాబాద్‌రూరల్: ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం నిర్వహించిన మేరీ మట్టీ మేరా దేశ్ కార్యక్రమానికి హాజరైనట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల స్మారకార్థం ప్రతీ గ్రామం నుంచి మట్టి సేకరించి ఢిల్లీలో అమృతవాటిక నిర్మాణానికి పిలుపునిచ్చారన్నారు. ఇందుకోసం హుస్నాబాద్ మట్టిని తీసుకెళ్లి అమృత కలశంలో వేసినట్లు చెప్పారు. ఢిల్లీ వెళ్లినవారిలో అక్కన్నపేట మండల అధ్యక్షుడు గొల్లపల్లి వీరాచారి తదితరులు ఉన్నారు.



ఢిల్లీలో హుస్నాబాద్ బీజేపీ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ **కొండపోచమ్మకు పూజలు**



జగదేవ్‌పూర్(గజ్వేల్): హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూతురు, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్మన్ విజయలక్ష్మీ మంగళవారం మండలంలోని శ్రీ కొండపోచమ్మ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట కృష్ణమూర్తి, ప్రసాద్‌రావు ఉన్నారు.

◆ **ఎంపీపై దాడి దుర్మార్గం**

వర్గల్(గజ్వేల్): ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని వర్గల్ మండల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మాదిరెడ్డి రాఘవరెడ్డి, లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నెంటూరులో మాట్లాడుతూ దాడి ఘటనను ఖండించారు.

◆ **జీవాలకు టీకాలు..రైతులకు లాభాలు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): సన్న జీవాలలో కాలానుగుణంగా సోకే వ్యాధుల నివారణకు టీకాలు వేయించి రైతులు ఆర్థికంగా లబ్ధి పొందాలని మండల పశు వైద్యాధికారి శ్వేత అన్నారు. మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం పుర్రు వ్యాధి నివారణ టీకాల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సన్న జీవాలకు చికిత్స కంటే ముందుగా వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టీకాల కార్యక్రమం ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

◆ **బూత్ కమిటీల ఏర్పాటు**

మద్దూరు(హుస్నాబాద్): జనగామ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి మద్దూరు మండలంలో బూత్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు బీఆర్‌ఎస్ జిల్లా జనగామ జిల్లా అధ్యక్షుడు సంపత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కూటిగల్, తోర్నాల, బెక్కల్, దూల్మిట్ట గ్రామాలలో బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు.

◆ **కుట్రలు కుతంత్రాలకు భయపడేదిలేదు**

తొగుట(దుబ్బాక): ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బీఆర్‌ఎస్ శ్రేణులు భయపడవని పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నానికి నిరసనగా మంగళవారం తొగుటలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ గెలుస్తుందన్న భయంతో ప్రతిపక్షాలు దాడులకు పాల్పడుతున్నాయన్నారు. ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆయా గ్రామాల్లోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో నాయకులు ప్రార్థనలు చేశారు.

◆ **కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీ**

తొగుట(దుబ్బాక): తొగుట మాజీ ఎంపీపీ గంట రేణుక, ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ బుర్ర అనిత బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు రైతుబంధు గ్రామ అధ్యక్షుడు గొల్ల రాములు తదితరులు చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు.



టీపీసీసీ ఫిషర్‌మెన్ కార్యదర్శి తిరుపతి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

◆ **నూతన నియామకం**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని పెరుకబండ గ్రామానికి చెందిన కర్రావుల శంకర్‌ను కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఆయన నియామక పత్రాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపెల్లి సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

◆ **మహాజన సింహగర్జన సభ జయప్రదం చేద్దాం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నవంబర్ 2న హైదరాబాద్‌లోని నాగోల్ శుభం గార్డెన్‌లో నిర్వహించనున్న మహాజన సింహగర్జన సభను విజయవంతం చేద్దామని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు సాయన్న గారి శ్రీనివాసాచారి మంగళవారం తెలిపారు. సభకు విశ్వబ్రాహ్మణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి గుగ్గిళ్ళ వేణు, కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు వట్టిపల్లి రమేష్, మహాదేవరాజు శ్రీనివాస్, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పార్టీ మారేది లేదు**

అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ అక్కన్నపేట మండల సర్పంచ్‌లపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతూ మూడోసారి ఎమ్మెల్యేగా సతీష్‌కుమార్‌ను గెలిపించుకుంటామని మంగళవారం మండల కేంద్రంలో 27 గ్రామాల సర్పంచ్‌లు స్పష్టంచేశారు. తాము పార్టీ మారేది లేదంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అన్నాడి దినేష్ రెడ్డి, గద్దల రమేష్, సంపత్, భానోతు రవీందర్, మాలోతు రాజు, లింగాల ఐలయ్య, కాశబోయిన యాదగిరి, సంపత్ పాల్గొన్నారు.